నేడు యథాతథంగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో పిజిఆర్ఎస్‌లో ప్రజలు తమ అర్జీలను డివిజన్, మండల కేంద్రాల కార్యాలయాల్లోనే సమర్పించాలని తెలిపారు. జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగా అధికారులు సేవలు అందిస్తారని, అందువల్ల ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని ఆమె తెలిపారు. అర్జీల స్వీకరణ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకూ నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు 'మీ కోసం' 1100 కాల్ సెంటర్ ద్వారా కొత్త ఫిర్యాదులు నమోదు చేయడంతో పాటు, ఇప్పటికే నమోదు చేసిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు.

కుండపోత వాన

- మరో 2 రోజులపాటు భారీ వర్షాలు
- గోదావరి నదిలో పెరుగుతున్న వరద
- 10 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం

కొవ్వూరులో పరవళ్లు తొక్కుతున్న గోదావరి వరద నీరు

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారం తెల్లవారుజాము నుచి ఎడతెరిపి లేకుండా కొనసాగుతున్నాయి. ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలో జనజీవనం స్తంభించింది. పలుచోట్ల వరి నాట్లు నీట మునిగాయి. వర్షాలు తగ్గుముఖం పట్టక ముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ప్రజాశక్తి-యంత్రాగం

కొవ్వూరు తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఆదివారం సరాసరి 6.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. రాజానగరంలో గరిష్టంగా 48.6 కోరుకొండలో 46.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. తాళ్లపూడిలో 12.4, సీతానగరంలో 5.2 గోకవరంలో 4.6, కొవ్వూరులో 3.2 మిల్లీమీటర్లు చొప్పున వర్షం కురిసింది. గోపాలపురం, రంగంపేట మండలాల్లో జల్లులు పడ్డాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరిలో వరద క్రమంగా పెరుగుతోంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్దకు 4.84 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని గోదావరి హెడ్ వర్క్స్ ఇఇ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 19 లేదా, 20 ఉదయానికి 10 లక్షల క్యూసెక్కుల నీరు ధవళేశ్వరం ఆనకట్ట వద్దకు చేరుతుందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేశారన్నారు. ప్రస్తుతం భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో క్యాచ్‌మెంట్ ఏరియాలో ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే నదిలో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. గోదావరిలో వరద ఉధృతి నేపథ్యంలో ఇసుక తవ్వకాలను అధికారులు సోమవారం నుంచి నిలిపి వేయాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో బోట్‌మెన్ సొసైటీల ఆధ్వర్యంలో నడిచే ఇసుక ర్యాంపుల్లో ఇసుక సేకరణకు బ్రేక్ పడనుంది. ప్రస్తుతం వాడపల్లి వంటి పెద్ద రాంపుల్లో ఇసుక నిల్వలు భారీగా ఉన్న దృష్ట్యా మరో రెండు రోజులు పాటు ఇసుక నిల్వలు సరిపోతాయని సొసైటీ నిర్వాహకులు చెబుతున్నారు. వరద ఉధృతి కాస్త నెమ్మదించిన తర్వాత పడవలు మళ్లీ యథావిధిగా నడుస్తాయని అధికారులు తెలిపారు.

రామచంద్రపురం వర్షాలతో మెయిన్ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వ్యాపార వాణిజ్య సంస్థలన్నీ మూతపడ్డాయి. ముమ్మరంగా సాగుతున్న కలుపుతీతలు భారీ వర్షాలతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భారీ వర్షాలతో అధికారులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

కపిలేశ్వరపురం విస్తతంగా కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి వరద ఉధతి పెరిగింది. దీంతో నదీ పరీవాహక ప్రాంతాలైన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలుచోట్ల లంక పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇటుక బట్టీలకు వరద నీరు చేరింది. వరద ఉధతి కారణంగా కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, పుష్కర ఘాట్ల పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. గతేడాది వరదల్లో పలుచోట్ల బలహీనంగా ఉన్న ఏటిగట్లకు ఇసుక మూటలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. పటిష్ట చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో వరద ఉధతి అధికమైతే ఆ ప్రాంతాల్లో పరిస్థితి ఏమిటని ప్రజలు బయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో వేసిన వరినాట్లు ముంపునకు గురయ్యాయి.

ఉప్పలగుప్తం కురుస్తున్న వర్షాలకు నాట్లు వేసిన వరి చేలు ముంపునకు గురవుతున్నాయి. మండలంలో సుమారు 3,790 ఎకరాల్లో వరి నాట్లు వేయగా వర్షాలకు సుమారు 500 ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగినట్టు అధికారులు చెబుతున్నారు. ముంపు వర్షానికి నీట మునిగిన వరి చేల నుంచి కొందరు రైతులు ఆయిల్ ఇంజన్లతో ముంపు నీటిని బయటకు తోడుకుంటున్నారు.

మామిడికుదురు అన్నదాతకు నాట్ల ప్రారంభంలోనే కష్టాలు ముంచెత్తాయి. డ్రైన్లు పూడికలతో ముంపు నీరు దిగక చినుకు పడితే చాలు నియోజకవర్గంలో పలుచోట్ల వరి నాట్లు జలాశయాలను తలపిస్తున్నాయి. అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షలకు నగరం, గెద్దాడ, ఈదరాడ తదితర ప్రాంతాల్లో ఇటీవల వేసిన నాట్లు ముంపు నీటిలో నానుతున్నాయి. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న అధికారుల హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2,679 ఎకరాల విస్తీర్ణంలో నాట్లు, 45 ఎకరాల విస్తీర్ణంలో నారుమళ్లు ముంపు బారిన పడినట్లు జిల్లా వ్యవసాయాధికారి బోసు బాబు తెలిపారు.

ముమ్మిడివరం ఎడ తెరిపి లేని వానతో మండలంలోనూ, నగర పంచాయతీ పరిధిలోనూ పలు రోడ్లు, కాలనీల్లో నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. నగర పంచాయతీలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం దీనికి తోడు పలు కాలనీల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. వర్షపునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి కాలువల్లోని మురుగు నీరు రోడ్లపైకి చేరుతుండటంతో అంటువ్యాధులు ప్రబలి ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పాత కాలపు డ్రైనేజీ వ్యవస్థ ఉండటంతో ప్రస్తుతం అది ప్రజా అవసరాలకు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు పలు ప్రాంతాల్లో మూసుకుపోయిన డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచి, మురుగునీరు సక్రమంగా దిగే విధంగా చర్యలు చెపడితే శ్రేయస్కరమని పలువురు కోరుతున్నారు.

గొల్లప్రోలు పట్టణంలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. జగనన్న కాలనీ సూరంపేట శివాలయం మాన్యం వెళ్లే మార్గాల్లో వర్షపు నీటితో పాటు చుట్టుపక్క ప్రాంతాల్లో కురిసిన వర్షంతో నీరు ఎక్కువ అయ్యింది. సుద్దగడ్డ ఏలేరు కాలువల ఉధతి ఎక్కువయ్యింది. కాలువలు నిండి పొంగిపొర్లుతున్నాయి. నాలుగు రోజులుగా జగనన్న కాలనీకి అధికారులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లే కొంతమంది బ్రిడ్జి పైకి నిచ్చెన వేసుకుని వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్‌సి కాలనీ, ఇబిసి కాలనీలో డ్రైనేజీల ద్వారా రోడ్లపైకి నీరు ఎగబాగుతోంది. సూరంపేటలో ప్రాథమిక పాఠశాల జలదిగ్బంధనం అయ్యింది. ఎస్‌సి కాలనీలో దళితుల శ్వశాన వాటిక పూర్తిగా నీట మునిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు బయటకు వచ్చేందుకు నిరాకరించారు. పట్టణ పరిధిలో పలు ప్రాంతాలలో సుద్దగడ్డ ఏలేరు ఉధతి కారణంగా పంట పొలాలు మళ్లీ నీటమునిగాయి. పైన మెట్ట ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా సుద్దగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోందని ఇరిగేషన్ జెఇ పద్మజ తెలిపారు. ఈ వర్షం కారణంగా వరి, పత్తి, మిగిలిన అపరాల పంటలపై తీవ్ర నష్టం ఏర్పడుతుందని, అప్పులు చేసి వేల రూపాయలు వ్యవసాయంలో పెట్టుబడి పెట్టామని రైతులు ఆందోళన చెందుతున్నారు

రౌతులపూడి నాలుగు రోజుల క్రితం ఆయా గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేసే పనుల్లో ఉన్నారు. వర్షంతో పంట పొలాల్లో రైతులు, రైతు కూలీలు అవస్థలు పడుతూ నాట్లు వేస్తున్నారు. జులై నెలలో వర్షాలు పడవలసి ఉన్నప్పటికీ సకాలంలో వర్షాలు పడవకపోవడంతో వరి నాట్లు ఆలస్యం అయ్యాయి.

కాజులూరు జోరు వానతో కాజులూరు మండలంలో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో ఫంక్షన్లకు వర్షం తీవ్ర అడ్డంకిగా మారడంతో బంధువులు లేకపోవడంతో ఆహార పదార్థాలు వథా అయ్యాయి. విద్యుత్ సరఫరాకు తీవ్రంగా ఆటంకం కలిగింది. అసలే రహదారులు శిధిలం కావడంతో ప్రయాణించడానికి సైతం వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. పలుచోట్ల విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడడంతో సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేదు.

పెద్దాపురం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు పరీవాహక ప్రాంతంలో వరి నాట్లు పూర్తయిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్టలో సాగు చేస్తున్న దుంప తోటలకు ఈ వర్షాలు మేలు చేస్తాయని భావిస్తున్నారు. మరోపక్క భవన నిర్మాణ పనులన్నీ వర్షం వల్ల ఆగిపోవడంతో అన్ని విభాగాల కార్మికులందరూ పనులు లేక అవస్థలు పడుతున్నారు. చేతి వృత్తిపై ఆధారపడ్డ వారు కూడా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.

కొవ్వూరులో కురుస్తున్న వర్షం

ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల వినతి

ప్రజాశక్తి తాళ్లపూడి

మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కల్పించిన కారణంగా పరోక్షంగా తాము ఆర్థిక ఇబ్బందులకు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు ఆటో డ్రైవర్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. తాళ్లపూడి యువశక్తి ఆటో యూనియన్ అధ్యక్షులు రజనీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆటోలు నడుపుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్న సుమారు 250 మందికి పైగా డ్రైవర్ల కుటుంబాలు వీధిన పడతాయని అన్నారు. నిరుద్యోగ యువతకు ఒకప్పుడు ఆటోలను అందించి ఆదుకున్న టిడిపి నేడు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని అందించిన కారణంగా తమ ఆటో డ్రైవర్లకు కూడా సంక్షేమ పథకాలను అందించి ఆదుకోవాలని కోరారు. అన్ని వర్గాల ప్రజల ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని జీవనోపాధి కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తమ ఆటో డ్రైవర్ల ఆర్థిక ఇబ్బందులు కూడా తెలుసుకుని ఆదుకోవాలని కోరారు.

సొసైటీ చైర్మన్‌గా రామారావు

ప్రజాశక్తి - సీతానగరం

మునికూడలిలో ఆదివారం సొసైటీ చైర్మన్ల ప్రమాణ స్వీకారంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మునికూడలి సహకార సంఘం చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సానిపల్లి వెంకట రామారావుకు అభినందనలు తెలిపారు. అనంతరం త్రీమెన్ కమిటీకి సన్మానం నిర్వహించారు. వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రైతుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.



స్పీకర్ అయ్యన్న, మంత్రి లోకేష్ రాక

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడ ఆదివారం మధురపూడి విమానాశ్రయానికి వచ్చారు. స్పీకర్‌కు విమానాశ్రయంలో ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం, స్పీకర్ అయ్యన్న విమానాశ్రయం నుంచి బయల్దేరి పాలకొల్లు వెళ్లారు. పాలకొల్లులో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నివాసంలో జరగనున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వెళ్లారు.

మంత్రి లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్‌పి

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్‌పి డి.నరసింహకిషోర్ తదితరులు మంత్రి లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడును విమానాశ్రయం లాంజ్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, డిఎస్‌పి కె.రమేష్ బాబు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్‌పి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-కడియం

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఇటీవల రైతులు ఖాతాలోకి అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ నిధులు జమ చేసినందుకు కృతజ్ఞతలతో, రూరల్ నియోజకవర్గ రైతులు వందలాది ట్రాక్టర్లతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కడియంలో ప్రారంభమై వేమగిరి, ధవళేశ్వరం, ఐఎల్‌టిడి జంక్షన్, కోటిపల్లి బస్టాండ్, స్టేడియం రోడ్, మోరంపూడి జంక్షన్, హుకుంపేట జంక్షన్, బొమ్మూరు జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గోరంట్ల మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.14000, కేంద్ర ప్రభుత్వం రూ.6000 కలిపి సంవత్సరానికి రైతుల ఖాతాల్లోకి రూ.20 వేలు జమ చేసినట్టు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ అందించి, అనేక రకాల పంటలకు కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తోందని తెలిపారు. 50 శాతం సబ్సిడీతో రైతులకు ఉపయోగపడే విధంగా అనేక రకాల పనిముట్లను అందిస్తున్నట్టు తెలిపారు. ర్యాలీ ముగింపు సమయంలో అనుకోని అతిథిగా బొమ్మూరు జంక్షన్‌లో అటుగా వెళుతున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కాసేపు ఎంఎల్‌ఎ గోరంట్లతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోరంట్ల రవి రామ్ కిరణ్, వెలుగుబంటి ప్రసాద్, మార్ని వాసుదేవ్, వెలుగుబంటి నాని, మత్స్యేటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, వట్టికూటి దత్తుడు, బోడపాటి గోపి పాల్గొన్నారు.

ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎంఎల్‌ఎ గోరంట్ల

వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పంటలకు నష్టం జరిగే అవకాశం ఉన్నందున, రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పంటల రక్షణ కోసం రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం అత్యవసరమని ఆమె సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు రైతులకు సూచించారు. యూరియాను వర్షకాలంలో పొలాల్లో చల్లడం వలన, అది నీటిలో కరిగిపోయి లేదా ఆవిరై పోయి వథా అవుతుందని వివరించారు. సాధారణ యూరియాలో కేవలం 30 శాతం మాత్రమే పంటలకు ఉపయోగపడుతుందని, మిగతా 70 శాతం వథా అవుతుందని రైతులు గమనించాలన్నారు. వర్షం తగ్గిన తరువాత ఘన రూపంలోని యూరియా బదులుగా నానో యూరియాను వినియోగించడం ద్వారా ఫలితాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. ప్రతి ఎకరాకు 500 మిల్లీ లీటర్ల నానో యూరియాను పిచికారీ చేయడం ద్వారా ఆకుల ద్వారా పంటకు చేరి 90 శాతం వరకు ప్రయోజనం కలిగిస్తుందని వివరించారు. దీని వలన పంటకు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం చేకూరుతుందని ఆయన తెలిపారు. అలాగే పొలాల్లో అధిక నీరు నిల్వ ఉండే పరిస్థితుల్లో డ్రైనేజీ ద్వారా బయటకు వెళ్లేలా తగిన ఏర్పాట్లు చేయాలని రైతులకు సూచించారు. వర్షం తగ్గే వరకు రసాయనిక ఎరువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని మాధవరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005-2006 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం జెడ్‌పి హైస్కూల్లో కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఆనాడు 200 మంది విద్యార్థులకుగాను 120 మంది విద్యార్థులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఆనాడు చదువు చెప్పిన పూర్వ ఉపాధ్యాయులను పూలమాలలు వేసి ఘనంగా సత్కించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వాసవి ఆనాటి ఉపాధ్యాయులు రాళ్లపల్లి వరప్రసాద్, సీతారామయ్య దంపతులు, చిక్కాల సతీష్ షేక్ జిలానీ, రత్న కుమార్ జగతా నాగలక్ష్మి సత్యనారాయణ దంపతులు సుజాత ప్రభావతి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం ఆర్గనైజింగ్ కొక్కురుపాటి నవీన్, బొబ్బిరెడ్డి వీరాస్వామి, యాళ్ల శివ, మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-గోపాలపురం

సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని సిఐ నాగేశ్వర నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని చెక్ పోస్ట్ సెంటర్‌లో ఎపియుడబ్ల్యుజె జెండాను సిఐ నాగేశ్వర నాయక్ ఆవిష్కరించారు. ముందుగా తొలుత యూనియన్ వ్యవస్థాపకులు మానుకొండ చలపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ నాగేశ్వర నాయక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు నిరంతరం పాటుపడుతున్నారన్నారు.. ఫోర్త్ ఎస్టేట్ విలువలతో పని చేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక బలమైన వారధిగా పనిచేస్తూ, సమాజ పురోగతికి జర్నలిస్టులు తోడ్పడాలని సూచించారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎస్ఐ పి.మనోహర్, దేవరపల్లి ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం, ట్రైనీ ఎస్ఐ శివ గణేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యాసరాల అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి

అనాథలను, అభాగ్యులను అన్ని విధాలా తమ సంస్థ ద్వారా ఆదుకుంటున్న దాతల ఔదార్యాన్ని వెలకట్టలేమని దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అబెడ్నెగో అన్నారు. చిడిపి పాఠశాలలో హెచ్ఎం మోహన్ రాజమహేంద్రవరంలోని జియోన్ అంధుల ఆశ్రమానికి రూ.10 వేల విలువైన నిత్యావసర వస్తువులను తమ ట్రస్టు ద్వారా అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతతో పాటు ట్రస్ట్ టీం సభ్యులు నాగరాజు, కిషోర్ పాల్గొన్నారని ఆయన తెలిపారు.

నేడు బౌద్ధ ధమ్మ పీఠంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలోని బౌద్ధ ధమ్మ పీఠం ఆధ్వర్యంలో మైత్రేయ బుద్ధ విహార్ ఆవరణలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి భంతే అనాలయో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొనసాగుతుందని తెలిపారు. ఉచిత కంటి పరీక్షలు, అర్హులైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళ పంపిణీతో పాటు, తెల్ల రేషన్ కార్డుదారులకు శుక్లాల ఆపరేషన్ కూడా చేయించనున్నట్టు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు బౌద్ధ ధమ్మ పీఠం, మైత్రేయ బుద్ధ విహార 93929 80666, 8500 768009 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గ్రంథాలయాధికారిని నియమించాలి

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు శాఖ గ్రంథాలయ అధికారి ఇటీవల బదిలీపై వెళ్లిపోవడంతో గ్రంథాలయ పుస్తక విభాగం వారానికి ఒకసారి మాత్రమే అందుబాటులో ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి పుస్తక విభాగం సేవలు అందుబాటులో లేక పోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రంథాలయానికి రోజూ 70 మంది వరకూ పాఠకులు వస్తూ ఉంటారని, గ్రంథాలయ అధికారి అందుబాటులో లేకపోవడం వల్ల వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

గుర్రపు డెక్కను తొలగించాలి

ప్రజాశక్తి-చాగల్లు

గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కౌలురైతులు కోరుతున్నారు. కొవ్వాడ కాలువకు చాగల్లు మండలంలో ఆరు వంతెనలు ఉన్నాయని, వర్షా కాలంలో గుర్రపు డెక్క అడ్డంపడి, పలు ప్రాంతాలు మునిగిపోతాయని తెలిపారు. కావున వచ్చే అధిక వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు ఊడ్చిన వరి పొలాల మునిగిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కావున సంబంధిత అధికారులు, వంతుల వద్ద గుర్రపు డెక్కలు తొలగించాలని పంట నష్టం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మికి పురస్కారం

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం సామజిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న భాగ్యలక్ష్మి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ద్వారా ఆగస్టు 15న ఉత్తమ ప్రశంశా పత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనపరచి సిహెచ్‌సిలో ఉత్తమ సేవలు అందించినందుకు ప్రశంశాపత్రం అందుకున్నట్టు గోకవరం సిహెచ్‌సి సూపరిండెంట్ రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రామలక్ష్మి వైద్యాధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పురస్కారం అందుకుంటున్న ఎఎన్ఎం భాగ్యలక్ష్మి

ఉత్తమ సేవలకు ప్రభుత్వం గుర్తింపు

ప్రజాశక్తి-నల్లజర్ల

పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంగా పని చేస్తున్న పి.ధనలక్ష్మికి ఉత్తమ సేవా పథకం అవార్డును జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, మంత్రి కందుల దుర్గేష్ ద్వారా అందుకున్నారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం తనకు ఇచ్చిన అవార్డు ద్వారా తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి డాక్టర్ సిరాజుద్దీన్, సిబ్బంది ఆమెను అభినందించారు.
రైటప్ ఉత్తమ సేవా పథకం అవార్డు అందుకుంటున్న ధనలక్ష్మి

పోస్ట్‌కార్డ్ రైటింగ్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-నిడదవోలు రూరల్

అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్ట్ 12న 'యువజనులకు మీరిచ్చే సందేశం' అనే అంశంపై గ్లోబల్ పోస్ట్ కార్డ్ రైటింగ్ కాంటెస్ట్-2025లో నిడదవోలుకు చెందిన నారాయణ పాఠశాలలో విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు. తపస్వి రెడ్డిని నిడదవోలు ఎంఇఒ పాడిశెట్టి గురుమూర్తి అభినందించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉడాన్ యూత్ క్లబ్ సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీలో ప్రపంచవ్యాప్తంగా 26 దేశాలకు చెందిన వారు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఏపి నుంచి తపస్విరెడ్డి పంపిన సందేశం ఎంపికకావడం అభినందనీయం అన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని వలసపాకల గ్రామం వద్ద ఆదివారం ప్రయివేటు ట్రావెల్ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాలు ప్రకారం.. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పూజారిపాలెం గ్రామానికి చెందిన ఓనుగుపాటి రమేష్(31) భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిలో చిన్నబ్బాయికి శస్త్ర చికిత్స నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌లో జాయిన్ చేశారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా రామచంద్రపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు వలసపాకల గ్రామం సమీపంలో అతివేగంగా వచ్చి రమేష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్ తమ్ముడు ఓనుగుపాటి నటరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించామన్నారు.

కారు ఢీకొని ఇద్దరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి రామాలయం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఒక మహిళ గాయపడ్డారు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యానం వైపు నుంచి వచ్చిన కారు రోడ్డు పక్కన నడిచి వెళుతున్న నిమ్మతి ఏసు అనే వ్యక్తిని ఢీ కొట్టి, అదుపుతప్పి రోడ్డు చెంతన ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నడిచి వెళుతున్న కొత్త కోరంగికి చెందిన నిమ్మతి ఏసు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో కూర్చున్న అరబరుకుల లక్ష్మి, దడాల ధనలక్ష్మి తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను తాళ్ళరేవు సిహెచ్‌సికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో అరబరుకుల లక్ష్మి(50) మృతి చెందింది. మృతురాలు పాత కోరంగి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పని చేస్తుంది. కోరంగి ఎస్ఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి శ్రీహరిరాజు వివరాలను వెల్లడించారు. రంపచోడవరం చెందిన అడపా సూర్యచంద్ర, కిర్లంపూడికి చెందిన అడపా జోగాఅమర్ రాష్ట్రంలోనే కాకుండా, హైదరాబాద్ పోలీస్ స్టేషన్లో పరిధిలో 16 కేసుల్లో నిందితులుగా ఉన్నారని అన్నారు. వీరిని ఆదివారం అన్నవరం శివారు మండపం సెంటర్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 13 బైక్‌లు, టివి, అరకేజీ వెండి వస్తువులు, అమ్మవారి రోల్డ్ గోల్డ్ హారం మొత్తం విలువ రూ.10 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రతిపాడు సిఐ సూరిఅప్పారావు, ఎస్ఐ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో ఐదుగురి అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక దర్గా సెంటర్ ప్రాంతంలో ఇటీవల జరిగిన వ్యభిచార సంఘటనకు సంబంధించిన కేసులో ఆదివారం ఐదుగురిని అరెస్టు చేసినట్లు సిఐ పి.విజయశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేతా శిరీష అనే మహిళ తనను బెదిరించి బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దింపినట్లు, తనతో ఖాళీ చెక్కులు, బాండ్ పేపర్లపై సంతకాలు పెట్టించుకున్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేశామన్నారు. ఈ దర్యాప్తులో మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో గొల్లపల్లి నాగమణి, దొండపాటి మధుకర్, చంద్రగిరి శివ, సూరి బ్రహ్మాజీ, చీపురుపల్లి శ్రీరాములు లను అరెస్టు చేసి కోర్టులో హజరుపర్చినట్లు తెలిపారు.

గంజాయి కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - రాజోలు

మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామంలో గంజాయి సేవించడంతోపాటు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు యువకులను ఆదివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం రాజోలు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ నరేష్ కుమార్ తెలియజేశారు. శంకరగుప్తం గ్రామంలో చవ్వాకుల నితీష్ అలియాస్ బంటి అనే యువకుడి ఇంట్లో గంజాయి కలిగి ఉన్నాడని సమాచారం పోలీసులకు అందింది. మలికిపురం ఎస్ఐ పివిఎస్ఎన్.సురేష్ దాడి చేసి రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆరుగురు యువకులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులు అయిన శంకరగుప్తం గ్రామానికి చెందిన చవ్వాకుల నితీష్, రాజమహేంద్రవరం అర్బన్‌కు చెందిన అమిటి ప్రశాంత్‌కుమార్, పడమటిపాలెంకు చెందిన తాడి హరీష్‌బాబు, బట్టేలంకకు చెందిన కోరుకొండ మనోజ్, చింతలమోరికి చెందిన భూపతి దిషాన్‌కుమార్, కేశనపల్లికి చెందిన గాడ శ్యామ్‌సన్‌లను అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు. వీరిలో ప్రధాన నిందితులు అయిన నితీష్, ప్రశాంత్ కుమార్, హరీష్‌బాబు గతంలో కూడా గంజాయి కేసులో మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్లో అరెస్టు అయ్యి జైలుకు వెళ్లి వచ్చారని తెలిపారు. వీరి తల్లిదండ్రులు ఉపాధి రీత్యా గల్ఫ్ దేశాలలో ఉండడం వలన వీరిపై పర్యవేక్షణ లేక, పట్టించుకునే వారు లేక చెడు వ్యసనాలకు లోనవుతున్నారని అన్నారు.

పురుగు మందు తాగి మహిళ మృతి

ప్రజాశక్తి - చాగల్లు

చిక్కాల గ్రామానికి చెందిన మాసిబోయిన పోశమ్మ (37) శనివారం తన కుమార్తెలు మందలించారని మనస్తాపంతో కలుపు మందు తాగింది. ఆమెను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలో ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించడగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వృత్తి నైపుణ్యంతో మహిళల ఆర్థికాభివృద్ధి

ఉచిత శిక్షణలో పాల్గొన్న వారితో మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మహిళలు వృత్తి నైపుణ్య శిక్షణలు తీసుకోవడం ద్వారా ఆర్థికంగా అభివద్ధి చెందుతారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మహిళలకు గృహ సంబంధ ఉత్పత్తుల తయారీపై నాలుగు రోజులపాటు ఇచ్చే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంగా, ఏటా లక్ష 75 వేల మంది మహిళ పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దీపం పథకం, తల్లికి వందనం, స్త్రీ శక్తి - ఉచిత బస్సు పథకం విజయవంతంగా అమలు చేశామన్నారు. వృత్తి విద్య కోర్సులు నేర్చుకుని స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కలగజేస్తామన్నారు. నిరుద్యోగ సమస్య లేకుండా చేసేందుకు పలు జాబ్ మేళాల నిర్వహణతో పాటు, మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణలు ఇచ్చి వారి స్వయం ఉపాధికి ఊత మిస్తున్నామన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) స్థాపనలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. చిన్నవయసులోనే భర్తలను కోల్పోయి బతుకు భారంతో ఉన్న వితంతు వులకు చిన్న వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఎంఎస్ఎంఇ ద్వారా, ముద్ర రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం వివిధ రకాల సబ్బులు, షాంపూలు, లోషన్లు, టూత్ పేస్టులు, లిప్ బామ్‌లు తదితర వాటిపై శిక్షణ ఇచ్చేందుకు బెంగళూరు నుంచి నిపుణులను తీసుకొచ్చామన్నారు. ఈనెల 20 వరకు శిక్షణ ఇస్తామని వెల్లడించారు. త్వరలోనే సెల్ ఫోన్ల రిపేర్, అగరబత్తీల తయారీ శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు శిక్షణ ఇచ్చే నిపుణురాలు ప్రియా జైన్(బెంగళూరు), ఎఎంసి ఛైర్మన్ కృల రిశ్వంత్ రాయ్, టిడిపి పట్టణ అధ్యక్షులు వుండవిల్లి శివ, కంచుమర్తి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన జయ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అమలాపురం మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అధికార జయ వెంకటలక్ష్మి అన్నారు. ఆదివారం అమలాపురం మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ పదవిని ఆమెకు కేటాయిం చడంలో సహాయం చేసిన ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, నియోజకవర్గంలోని పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉపాధ్యక్షులు పరమట చిట్టిబాబు, డైరెక్టర్లు మోటూరి సుభాషిని దేవి, నూకల రాజా, నేల భువనేశ్వరి, పిల్లా ప్రసాద్, మంద గద్దయ్య, కంచిపల్లి మహాలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. వెంకటలక్ష్మికి ఈ పదవి దక్కడం పట్ల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం మండల జనసేన పార్టీ అధ్యక్షులు లింగోలు పండు, చిందాడగురువు ఎంపిటిసి సభ్యుడు మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ పడాల శ్రీదేవి నానాజీ, జనసేన పార్టీ కార్యదర్శి కొప్పుల నాగ మానస, మోటూరి కిరణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్, మిగిలిన సభ్యులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

పంట కాలువల్లో వ్యర్థాలు తొలగించాలి

ఈదరాడ కాలువ గట్టు తాటిపాక రోడ్డుపై ప్రవహిస్తున్న సాగునీరు

ప్రజాశక్తి - మామిడికుదురు

పంట కాలువలలో వ్యర్థాలు, గుర్రపు డెక్క అడ్డుపడటంతో పాటు ఆక్రమణలతో కాలువలు పూడుకుపోయాయి. దీంతో నీరు ముందుకు ప్రవహించక కాలువ గట్లు పొంగి సమీప నివాస ప్రాంతాలు మునిగి పోవడంతో ఆ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. తాటిపాకనుంచి ఈదరాడ వెళ్లే పంట కాల్వ దుస్థితి చాలా అధ్వానంగా ఉంది. తాటిపాక సమీపంలో కిలోమీటర్ మేర నివాస గృహాలలో చెత్తాచెదారం కాలవల్లో పడవేయడమే కాకుండా గుర్రపుడెక్కతో మూసుకుపోవడంతో నీరు ముందుకు వెళ్లక కాలువ గట్టు తాటిపాక రోడ్డు నీట మునిగి రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. అదే విధంగా నగరం సమీపంలో అనధికార వంతెనలతో వంతెనల వద్ద చెత్తాచెదారం అడ్డుపడి నీటి ప్రవాహం ముందుకు వెళ్లటానికి ఆటంకం కలుగుతోంది. తాటిపాక ఈదరాడ ఛానల్ కాలవలో చెత్త తూడు తొలగించే చర్యలు చేపట్టాలని రైతులు విన్నవిస్తున్నారు

సినిమా టిక్కెట్ల ధరలు పెంచి దోపిడీ

ద్రాక్షారామంలో వార్2 సినిమా వద్ద ప్రేక్షకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కొత్త విడుదలైన సినిమాలకు సంబంధించి టిక్కెట్లు రేట్లు భారీగా పెంచడంతో సగటుప్రేక్షకులు, సామాన్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సినిమా టిక్కెట్ల ధరలు తగ్గించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జూనియర్ ఎన్‌టిఆర్ నటించిన వార్ 2 సినిమా, నటుడు రజనీకాంత్ నటించిన కూలి సినిమాలు ఈ నెల 14న విడుదలయ్యాయి. సాధారణంగా పట్నాలలో మల్టీప్లెక్స్ థియేటర్లలో అధిక రేట్లు వసూలు చేస్తారు. ఇక బి, సి సెంటర్లలో సామాన్యులకు అందుబాటులో టిక్కెట్లు రేట్లు ఉండేవి. సి సెంటర్లలో గత ఏడాది రూ.60, రూ.70 ఉన్న టిక్కెట్ ధరలు ఈ సినిమాలకు అమాంతం పెంచేశారు. ఒక్కో టిక్కెట్ ధర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని రూ. 200 వసూలు చేస్తున్నారు ఫ్యామిలీలలో నలుగురు సినిమాకి వస్తే రూ.1000 వరకు ఖర్చు అవుతుందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. దీనిపై అధికారులు స్పందించి సి సెంటర్లలో టిక్కెట్ల పెరుగుదలను నియంత్రించాలని సామాన్యులకు అందుబాటులో ఉండే రూ.100 వరకు మాత్రమే ధరలు ఉండేలాగా చర్యలు తీసుకోవాలని ప్రేక్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు. కూలి తమిళ సినిమా డ డబ్బింగ్ సినిమాలకు కూడా రూ.200 వసూలు చేయటం ఎంతవరకు సమంజసమని ప్రేక్షకులు ప్రశ్నిస్తున్నారు. ఇక థియేటర్లలో అమ్మే తిను బండారులపైనా నియంత్రణ లేకపోవడంతో ఇష్టాను రీతిగా అమ్మకాలు కొనసాగిస్తున్నారని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినోదం కోసం సామాన్యులు థియేటర్లకు వెళితే అధిక ధరలు వసూలు చేయడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం సి, బి సెంటర్లలో థియేటర్లలో ప్రదర్శించే సినిమాలకు అధిక ధరలు లేకుండా నియంత్రించాలని, అధిక ధరలో 200 చెప్పున వసూలు చేయటం పై చర్యలు చేపట్టాలన్నారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం టిక్కెట్లు పెరుగుదలకు ఒప్పుకోక పోవడంతో అక్కడ సామాన్యులు సినిమా చూసేందుకు వెలుసుబాటు లభించిందన్నారు. ఎపిలోని కూటమి ప్రభుత్వం అధిక ధరలకు అనుమతి ఇవ్వడంతో పల్లెల్లోని సామాన్యులకు వినోదాన్ని దూరం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.దీనిపై వెంటనే స్పందించి ధరల్లో నియంత్రణకు చర్యలు చేపట్టాలని టిక్కెట్ రూ 100 కంటే అధికంగా వసూలు చేయకుండా సామాన్యులకు సినిమా చూసే వీలు కల్పించాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

మోడరన్‌లో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో గోలిమంగాదేవి మోడరన్ హైస్కూల్ నందు అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్ర ధారణలో అలరించారు. బాలకష్ణుడు, గోపికల వేషధారణలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హైలైట్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు, మోడరన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి ప్రసంగించారు. శ్రీకష్ణతత్వంపై అకాడమిక్ డైరెక్టర్ ఆర్. ఉమాదేవి రూపొందించిన అష్టప్రశ్నావళిని ఇంటర్మీడియట్ అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్ ప్రశ్నల రూపంలో అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ట్రెజరర్ గోలి మంగాదేవి, అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి, ఇంటర్ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, హైస్కూల్ కో-ఆర్డినేటర్ వై.రాజు, మోడరన్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ విలీనం కోసం జెఎసి ఎంపిక

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజ కవర్గాన్ని కాకినాడలో కలిపేందుకు అఖిలపక్ష సమావేశం జాయింట్ యాక్షన్ కమిటీ(జెఎసి)ని ఎంపిక చేసింది. కన్వీనర్‌గా ప్రముఖ న్యాయవాది మాగాపు అమ్మి రాజు, కో-కన్వీనర్‌గా పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, గౌరవ అధ్యక్షులుగా టిడిపి సీనియర్ నాయకులు గరికిపాటి సూర్య నారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉండవిల్లి గోపాలరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు గాధంశెట్టి శ్రీధర్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, స్టీరింగ్ కమిటీ సభ్యులుగా రామచంద్రపురం సీనియర్ న్యాయవాదులు గాలింకి చిట్టిబాబు, దొమ్మలపాటి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎ. రిశ్వంత్ రాయ్, పి.రాము, శారద, తోట సూరిబాబు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు వి.భీమా శంకరం, సిఐటియు నాయకులు నూకల బలరాం, ఎం.దుర్గ, టిడిపి నాయకులు బల రాం, నాయుడు మాస్టర్, శిరిగినీడి దుర్గా ప్రసాద్, దాసు, న్యాయ వాదులు హరినాథ్ రెడ్డి, కమల కుమారి తదితరును ఎంపిక చేశారు .

బొబ్బర్లంక వద్ద కానరాని పులస జాడ

ఒడిశా పులసలకు పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పుస్తెలతాడు అమ్మి పులస చేప తినాలన్నదే నానుడి. కానీ మండలంలోని బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ దిగువన గౌతమి, వశిష్ట గోదావరి నది పాయలలో గత సంవత్సరం నుంచి ఒక్క పులస కూడా మత్స్యకారుల వలకు చిక్కిన దాఖలాలు లేవు. సామాన్యులు పులస చేప తినాలంటే భారంగా మారింది దీంతో ఒడిశా నుంచి వచ్చే పులస చేపలను కొనుక్కుని తింటున్నారు. దీంతో ఒడిశా నుండి వచ్చే పులస చేపలకు డిమాండ్ బాగా పెరిగింది. గతంలో రూ.200 నుంచి రూ.500 వరకు పలికన ఒడిశా పులస చేపలు ఇప్పుడు రూ.2000 పలుకుతున్నాయి..పులస చాపలు సముద్రం నుండి ఎదురీదుకొని వలస రాకపోవడంతో పులస ప్రియులకు, మత్స్యకారులకు నిరాశే ఎదురవుతోంది. రాజమహేంద్రవరం నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అంతా గోదావరిలో కలవడం, పేపర్ మిల్లులో వచ్చే వ్యర్థాలు కెమికల్స్ తో శుభ్రం చేయకుండా నేరుగా గోదావరి లోకి వదిలేయడం, అలాగే యానాం వద్ద ఓఎన్‌జిసి ఆయిల్ నిక్షేపాల కోసం రిగ్గులు వేయడంతో గోదావరి అడుగుభాగాన పైపులైన్లు వేయడంతో వాటి నుంచి వచ్చే వైబ్రేషన్కు సౌండ్‌కి పులసలు వలసలు తగ్గాయి. దీంతో ఒడిశా నుంచి వచ్చే ఇలస చేపలని పులసలుగా అమ్ముతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే మత్స్యకారుల వలలో పులస చేప పడిందంటే వారి ఇంటిల్లపాది పండగే కానీ గత సంవత్సరం నుండి బొబ్బర్లంక బ్యారేజీ వద్ద ఒక్క పులుసు కూడా మత్స్యకారుల వలలకు పులస చిక్కగా పోవడంతో మత్యకారులకు నిరస ఎదురైంది.

యానాంలో పులస రూ.26 వేలకు కొనుగోలు

సంవత్సరానికి ఒకసారి అయినా పులస చేప తినాలని నా కోరిక గత సంవత్సరం నుంచి మా మండలంలో గోదావరి నదిలో పులస చేప జడలేదు. యానాంలో కేజీ పులుసను వేలంపాటలో రూ. 26 వలకు ఇటీవల దక్కించుకున్నాను. ఇంటిళ్లపాది ఎంతో ఆనందంతో పులస చేపల రుచిని చూశాం.

- బెజవాడ సతీష్ ,పేరవరం గ్రామం, ఆత్రేయపురం మండలం

మండలంలో వరి నాట్లు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

వరుణుడు కరుణించడంతో మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని గుర్రంపాలెం, గొల్లలగుంట, కాండ్రేగుల, భావవరం, నరేంద్రపట్నం, మల్లిశాల, వెంగయ్యమ్మపురం తదితర గ్రామాల్లో అక్కడక్కడ రైతులు వరి నారు మళ్ళు వేశారు. అనంతరం ఎండ తీవ్రత పెరగడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగడం కష్టమనే భావనలోకి రైతులు వెళ్లారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నారు ఉన్నవారు నాట్లు వేస్తున్నారు.

ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న ఎంఎల్ఎ వేగుళ్ల

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - మండపేట

మండపేట సూర్యాపేటలో ఆదివారం గంగమాంబ సుకీర్తి సమేత బసవేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణ శంకుస్థాపన చేవారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళ విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు మచ్చా నాగు, తదితరులు,పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు మేరకు కేసు

ప్రజాశక్తి - సీతానగరం

పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు ఆధారంగా ఆదివారం సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. బొబ్బిలంక గ్రామం సుబ్బారావు పేట కాలనీకి చెందిన మహిళ గాడి రమణ తనను దూషించి, మెడలో ఉన్న మూడు కాసుల బంగారం గొలుసు లాక్కునిపోయారని, చంపేస్తానని బెదిరించారని సీతానగరం పోలీసులకు ఇద్దరు మహిళలపై పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా అదే గ్రామానికి చెందిన నూతాటి కల్యాణి, మరొక మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

రెండు వర్గాల ఘర్షణ : పలువురికి గాయాలు

ప్రజాశక్తి-గోపాలపురం

రెండు వర్గాల ఘర్షణలో పలువురికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి గోపాలపురం బిసి కాలనీకి చెందిన యువకులు, ఉప్పరగూడెం గ్రామానికి చెందిన యువకులు పరస్పరం ఘర్షణ పడ్డారు. దీంతో ఇరువర్గాలు ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో రెండు వర్గాలకు చెందిన సుమారు 200 మంది యువకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో దేవరపల్లి సిఐ నాగేశ్వర్ నాయక్ దేవరపల్లి, గోపాలపురం, పోలీస్ స్టేషన్ల నుంచి ఎస్ఐలు సిబ్బంది స్టేషన్ వద్దకు చేరుకున్న ఇరువర్గాలనూ చెదరకొట్టారు. కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

మార్కెట్ కమిటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసింది. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్‌పర్సన్‌గా అందుగుల మణికుమారి, వైస్ ఛైర్మన్‌గా సిద్దు వెంకటకృష్ణ భవన్నారాయణ, డైరెక్టర్లుగా పోతుల సీతామహాలక్ష్మి, దేవిశెట్టి ఏసుబాబు, లింగం ఉషా, తలాటం అచ్చుత˘రామయ్య, అడపా భార్గవిచక్ర, కోటికలపూడి నవీన తదితరులు బాధ్యతలు స్వీకరించారు.

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
AS2/2021

Between:-
సూరంపూడి వెంకటలక్ష్మి ...అప్పిలెంట్
మరియు
గుత్తుల గంగరాజు మరియు వగైరాలు ...రెస్పాండెంట్స్

రెస్పాండెంట్ నెం.21
గాడ సత్యనారాయణ S/o.లేటు నరసింహమూర్తి, వయసు 49సం॥లు, డోనెం.8-113, కొత్తకోలని, టేకి గ్రామం, కపిలేశ్వరపురం మండలం, డా॥బి॥ఆర్ కోనసీమ జిల్లా.
పై నెంబరు దావాలో 21వ రెస్పాండెంట్‌కు ఎన్నిమార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారి ఎదుట ది.12-09-2025వ తేదిన ఉ॥యం 10.30ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడును.
అల్లం గనిరాజు
రామచంద్రపురం అప్పిలెంటు తరపు అడ్వకేట్
ది.17-08-2025 సెల్.9182022981

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అంబాజీపేట మండలం, గంగలకుర్రు అగ్రహారం గ్రామ కాపురస్తులు మట్టపర్తి సూర్యనారాయణ గారి కుమారుడు మట్టపర్తి వీరేశ్వరరావు గారి సంజాయిషీపై యావన్మందికి తెలియచేయునది ఏమనగా
నా క్లయింట్‌కు గిఫ్ట్ సెటిల్‌మెంట్ దస్తావేజు ది. 10-04-2025 డాక్యుమెంట్ నెం.1411/2025 రీత్యా రి.స.నెం.196-5లో య.0.031/2 సెంట్లు అనగా 169.4 చ॥గ॥ స్థలము, సమీప డోర్ నెం.6-92 మట్టపర్తి వెంకటలక్ష్మి వగైరాల ద్వారా సంక్రమించినది. దాని లింక్ దస్తావేజు ఒరిజినల్ క్రయ దస్తావేజు ది.22-01-1997, దస్తావేజు నెం.127/1997 మట్టపర్తి సూర్యనారాయణ గారి పేరున ఉన్న దస్తావేజు పొటోస్టాట్ కాపీల నిమిత్తం నా క్లయింట్ తన ఇంటి నుంచి అంబాజీపేట వెళ్ళు మార్గ మధ్యములో ది.10-07-2025న పడిపోయినది. సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన యెడల మరియు సదరు ఆస్థిపై గిఫ్ట్ సెటిల్‌మెంట్ దస్తావేజునెం.1411/2025 ఎవరికైనా అభ్యంతరము ఉన్న యెడల ఈ ప్రకటన తేది నుంచి వారం రోజుల లోగా లిఖితపూర్వకముగా ఈ క్రింది ఉదహరించిన వారికి తెలియచేయవలెను. లేని యెడల సదరు ఆస్థిపై ఎటువంటి అభ్యంతరములు లేవని పరిగణించబడును.
G.V.V.S.N.GUPTHAA
Advocate
Amalapuram-533201
Cell. 9849470531

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టు
F.D.I.A.No.7/2023 in O.S.No.77/2004

Between:-
అరిగెల కేశవరామమూర్తి(డైడ్) వగైరా ...పిటీషనర్లు
And
అరిగెల స్వామినాయుడు(డైడ్) వగైరా ...రెస్పాండెంట్లు
R18. వరికూటి లక్ష్మీ మంగతాయారు W/o. త్రినాధరావు, కాకినాడ రైల్వేస్టేషన్ ఎదురుగా, శ్రీరామ్ నగర్ రైల్వేక్వార్టర్సు, శ్రీరామ్‌నగర్, కాకినాడ
R19. సంకుజ్యోతి, W/o. ధన పరమేశ్వరరావు, డో.నెం.3-4-2, గుడివాడ అప్పన్న కాలనీ, BHPV పోస్టు, గాజువాక మండలం, విశాఖపట్నం-12.
R20. కొమ్మిశెట్టి లత W/o.నాగేంద్ర, డో.నెం.6-1-2, వాడ్రేవు వారి వీధి, శ్యామలా టాకీసు వద్ద, టి.నగర్ కాలనీ, రాజమండ్రి.
యిందలి పిటీషనర్లు మీపైన మరియు ఇతర రెస్పాండెంట్లు పైన ది.07-03-2019న పొందిన ప్రిలిమినరీ డిక్రీని పురస్కరించుకొని వాటాలు విభాగము చేయవలసిందిగాను కోరుతూ ఫైనల్ డిక్రి పిటీషను దాఖలు చేయగా సదరు పిటీనులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిచిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఫైనల్ డిక్రీ పిటీషను మీ హాజరు కొరకు ది.02-09-2025 నాటికి వాయిదా వేసినారు. కావున ది.02-09-2025 ఉ॥10.30ని॥లు లగాయితు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని మీ తరపున వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలసిందిగా లేని యెడల సదరు పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
అమలాపురం N.S.N.Murthy
ది.13-08-2025 పిటీషనర్ను తరపు న్యాయవాది

మహారాజశ్రీ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు కాకినాడ
I.A. HMOP35/2025

Between"-
నున్నం నాగదేవి ...పిటీషనర్
మరియు
నున్నం పవన్ ...రెస్పాండెంట్
టు.
నున్నం పవన్ S/o.N.సత్యనారాయణ, వయసు37సం॥లు, బంగారమ్మ కోలనీ, వేములపల్లి, ద్వారపూడి.
పై నెంబరు కేసు నందు పిటిషన్‌లో ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు సమన్లు రిజిష్టర్ పోస్టు పంపించినను నోటీసులు తీసుకొనలేదు ఉద్దేశ్యపూర్వకంగాను కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తము 10-09-2025సం॥ ఉదయం 10.30 తేదీకి వాయిదా వేసినారు మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని పై శ్రీ కోర్టు వారి ఎదుట హజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
యనమల రామం
కాకినాడ అడ్వకేట్,
16-08-2025 కాకినాడసెల్.9848442583

మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
O.S.No.371/2020

Between:-
Yakkala Malleswara rao,S/o. Veerabhadram, Hindu Aged 45 years, R/o.Ramavaram Village, Anaparthi Mandal, East Godavari District. ...Plaintiff
And
Kotteda Bharathi, W/o. Muneswara rao, Hindu Aged 41 years, R/o.D.No.44-11-5/4, Annapurnammapeta, Rajahmundry. ...Defendant
పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది.21-08-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.శ్రీనివాసు
అడ్వకేట్
రాజమండ్రి రాజమండ్రి
17-08-2025 సెల్.9705256019

PUBLICATION IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE JUNIOR DIVISION KOTHAPETA
IA No of 2024 OSNo.294 of 2024

Between:-
Lutukurthi Satyanarayana, S/o. Venkanna, Hindu, Cultivation, age 64 years, D No 1-7, Katharulanka, PGannavaram Mandal and Others ...Petitioners/Plaintiffs
Vs
1. Lutukurthi Nagalakshmi, and others.
4. Chuttugulla Gangaratnam, W/o. Samuel, Hindu, House wife, age 53 years, Chuttugullavaripeta, P Gannavaram Mandal, Kothapeta JCJ (4th Respondent 4th Defendant)
5. Manda Saraswathi, W/o. Satyanarayana, Hindu, House wife, age 51 years, Katharulanka, P Gannavaram Mandal, Kothapeta JCJ (5th Respondent 5th Defendant)
...Respondents No. 4 & 5/ defendants No.4 & 5
The above named petitioners has instituted the above in OS No 294 of 2024 seeking Permanent injunction along with the suit filed IA of 2024 restraining the respondents/ defendants from ever interfering with the plaint schedule property. That the above matter is stands posted to **29-09-2025 at 10.30** AM for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.
(by the orders of the Hon'ble court)
Makireddy Adinarayana rao
Advocate, Vidyut Nagar
Amalpuram9848059496